# అంటింపు

"ఏం కావాలి సార్? షర్టింగ్సా, సూటింగ్సా, సారీసా?" అడిగాడు షాపు యజమాని వచ్చిన కస్టమర్ని. "ఇవేవీ కావు. శాలువాలు కావాలి. పండిత శాలువాలు!" అన్నాడా కస్టమర్. ఆ కస్టమర్ రెండు చేతులకీ ఎనిమిది ఉంగరాలు మణులు పొదిగినవి ఉన్నాయి. మెళ్లో పులి గోరున్న గొలుసు. శ్రీమంతుడని ఈజీగా పసిగట్టెయ్యొచ్చు.

"అబ్బాయిలూ శాలువలు చూబెట్టండ్రా" అన్నాడు షాపు యజమాని. చాకుల్లాంటి పనికుర్రాళ్లు పదిరకాల శాలువలు పది రంగుల్లో, రకరకాల జరీ అంచుల్లో టేబుల్‌మీద పరచేసారు.

"ఖరీదు?" అడిగేడు శ్రీమంతుడు.

"ఒక్కొక్కటి నాలుగు వందలు సార్" అన్నాడుషాపుయజమాని. "ప్చ్" పెదవి విరిచేడు శ్రీమంతుడు "నాకు వెయ్యి రూపాయల శాలువాలు రెండు కావాలి. ఈ నాసిరకం నా కవసరం లేదు!" పని కుర్రాళ్లు ఒకరి మొహా లొకరు చూసుకున్నారు.

"సార్! అవిగో కొత్తబట్టల బేళ్లొచ్చాయి. రేపు విప్పుతాము. వాటిలో తమక్కావాల్సిన ఖరీదైన శాలువలున్నాయి. తమరు మరోలా అనుకోక రేపు దయచేస్తే, తమ క్కావాల్సినవి ఎంచుకోవచ్చు" అన్నాడుయజమాని. శ్రీమంతుడు గారు మర్నాడు దర్జాగా 'కాంటెస్సా 'లో వచ్చారు.

"ఇవిగో సార్ తమరు ఎంచుకోండి" అని కొత్త శాలువలు చూబెట్టాడు యజమాని. శ్రీమంతుడుగారు చేత్తో నాణ్యతా పరీక్ష చేసుకున్నారు. శాలువలన్నీ మెత్తగా నిగనిగ లాడుతూ వున్నాయి. 'ఈ రెండూ ప్యాక్ చేయండి' అన్నారాయన.

కుర్రాళ్లు అందంగా ప్యాక్ చేసేసి ప్లాస్టిక్ సంచీలో పెట్టి ఇచ్చారు. శ్రీమంతుడు గారు డబ్బు చెల్లించేసి వెళ్లిపోయారు.

ఆ శాలువలు నిన్న శ్రీమంతుడు గారు చూసిన నాలుగు వందల రూపాయల వెరైటీవే, వాటికి వెయ్యి రూపాయల స్టిక్కర్లు అంటించేసి అంటగట్టారు.

మర్నాడు షాపు యజమాని నిన్నటి కలెక్షన్స్‌ని బ్యాంకులో జమచేయడానికి వెళ్లితే అందులో ఐదు వందల రూపాయల నోట్లు నాలుగు దొంగనోట్లని బ్యాంకువారు రిపోర్టివ్వగా, షాపు యజమానిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు!

28-4-2001

ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక